Website: www.subhatelangana.in

సోమవారం
7 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 151
పేజీలు : 6
వెల : 3/-

RNI-TELTEL/2017/72695

# శుభ తెలంగాణ

మేడ్చల్

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar




## త్వరలోనే నూతన రెవెన్యూ చట్టం తీసుకొస్తాం

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- రైతులు ఇబ్బందులు పడకుండా ఈ చట్టం దేశంలోనే ఆదర్శంగా ఉండబోతుంది
- అధికారుల నుంచి సూచనలు, సలాహాలు ఆహ్వానిస్తాం
- రాష్ట్రంలో 10,900 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి
- ప్రతి రెవెన్యూ విలేజ్‌కు రెవెన్యూ అధికారిని నియమించాలని అధికారులు కోరుతున్నారు.

## మూసీ ప్రక్షాళన చేసి
# తీరతాం

- తరాల తరబడి పేదలు మురికిలోనే జీవించాలా?
- వారి జీవన విధానంలో మార్పు రావద్దా?
- ఇళ్లు కోల్పోయేవారి బాధలు నాకు తెలియవా?
- హరీశ్, కేటీఆర్, ఈటలను వారం రోజులు
- పేదల మధ్య ఉంచితే సమస్యలు అర్థమవుతాయి
- రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ఏమైందో చూశాం
- నోటిఫికేషన్లు ఇచ్చి నియామకాల్ని విస్మరించారు
- పది నెలల్లో 60 వేల నియామకాలు చేశాం




**శుభ తెలంగాణ హైదరాబాద్**

మూసీలో మురికిని తొలగించేందుకే ప్రక్షాళన కార్యక్రమం చేపట్టామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎవరు అడ్డొచ్చినా ఇది ఆగదని స్పష్టం చేశారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నవారు.. ఏళ్ల తరబడి మూసీ మురికి కూపంలో జీవిస్తున్న వారి గురించి ఆలోచించాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో దుర్భర జీవితం గడుపుతున్న పేదల బాధలు అర్థం చేసుకోరా? తరాలన్నీ మూసీ మురికిలోనే జీవించాలా? వారి జీవన విధానంలో మార్పు రావద్దా? అని ప్రశ్నించారు. తాను జడ్పీటీసీ నుంచి ఇక్కడిదాకా వచ్చానని, - మిగతా3లో



## భూమికి మరో ముప్పు


- దూసుకువస్తున్న మరో భారీ సౌర తుఫాను!
- ఇది కమ్యూనికేషన్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం
- ఈ సౌర తుఫాను భారత్‌పై ఎక్కువగా ప్రమాదం ఉండదు
- ఇది ఉపగ్రహాలతో పాటు టెలికమ్యూనికేషన్స్‌కు అంతరాయం కలిగించే ఛాన్స్
- ఈ సౌర తుఫానును పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు



- బీజేపీపై కేజ్రీవాల్ విమర్శలు
- వచ్చే ఏడాది సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ రిటైర్ అవుతారు
- ఢిల్లీలో చేసిన ఏ ఒక్క పనైనా 22 రాష్ట్రాల్లో ఒక్క ఏడాదిలో చేయాలి
- ఢిల్లీ ప్రజల ప్రేమ, మద్దతు, నమ్మకమే నా నిజాయితీకి నిదర్శనం
- అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయి
- అక్కడ చేసిన మంచి పని ఒక్కటి చెప్పాలి

## వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా..
# ముఖ్యమంత్రికి సోయి లేదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణెం
- కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారు




**శుభ తెలంగాణ హైదరాబాద్**

రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణమని విమర్శించారు. పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నరు, కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారని దుయ్యబట్టారు. రైతుకు రక్షణ వలయంగా ఉన్న - మిగతా3లో

## కాంగ్రెస్ మోసాలపై చర్చించండి

- అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గ్యారెంటీలు అమలు చేయలేకపోగా..
- మీ ఊళ్లలో అవ్వాతాతలకు పెంచుతామన్న పింఛన్ పెంచలేదు
- రుణమాఫీ పూర్తి చేయలేదు.. రైతు బంధును నిలిపివేశారు
- యువతకు హరీశ్‌రావు పిలుపు..



**శుభ తెలంగాణ హైదరాబాద్**

గతేడాది దసరా సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నమ్మి తమ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసిన యువత ఒక్కసారి ఆలోచించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గ్యారెంటీలు అమలు - మిగతా3లో

## అంతర్జాతీయ ప్రమాణాలతో
# పాఠశాలలు ఏర్పాటు



- ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేస్తాం
- తెలంగాణలో రూ.5 వేల కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లు
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ల నమూనా విడుదల
- కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మంత్రులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు నెలకొల్పుతున్నామన్న భట్టి
- గత ప్రభుత్వం పేద విద్యార్థులను పట్టించుకోలేదన్న కోమటిరెడ్డి

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థ నవీకరణకు కీలక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు నెలకొల్పాలని నిశ్చయించింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ కు 20 నుంచి 25 ఎకరాల స్థలం కేటాయించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాఠశాలల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాన్సెప్ట్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. సచివాలయంలో రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్లను ఇవాళ(ఆదవారం) విడుదల చేశారు. సచివాలయంలో భట్టి - మిగతా3లో

## పంచాయతీలకు
# నిధుల కటకట!

- రోజువారీ పనులకు కూడా డబ్బుల్లేవు
- పడకేసిన పారిశుద్ధ్యం.. జ్వరాల విజృంభణ
- దాదాపు 4 వేల కోట్లు విడుదలచేయని సర్కార్
- అప్పులు చేయాల్సిన దుస్థితిలో కార్యదర్శులు



**శుభ తెలంగాణ హైదరాబాద్**

గ్రామ పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో పల్లెలను నిధుల కొరత వేధిస్తున్నది. ఆదాయ వనరులు అంతగా లేని పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. దీంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి అత్యవసర ఖర్చులకు సర్దుబాటు చేయాల్సి వస్తున్నది. అభివృద్ధి పనుల మాట దేవుడెరుగు.. కనీసం వేతనాలు, కరెంటు బిల్లులు, ఈఎంఐలకైనా నిధులు ఇవ్వండి మహాప్రభో అని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని - మిగతా3లో



## సికింద్రాబాద్ నుంచి
# గోవాకు కొత్త రైలు

- ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- గోవా టూర్‌కు వెళ్లే పర్యాటకుల సౌకర్యార్థం అందుబాటులోకి మరో కొత్త రైలు
- కొత్త రైలు పర్యాటకుల ప్రయాణ అవకాశాల్ని పెంచనుంది.

**శుభ తెలంగాణ హైదరాబాద్**

హైదరాబాద్ మహానగరం నుంచి తరచూ గోవా టూర్‌కు వెళ్లే పర్యాటకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే మరో కొత్త రైలును అందుబాటులోకి తెచ్చింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు రెగ్యులర్ సర్వీసులు సికింద్రాబాద్ నుంచి ఈ నెల 9న, వాస్కోడగామా నుంచి ఈ నెల 10న ప్రారంభమవుతాయి. - మిగతా3లో

# ఎలాంటి చర్చలు ఉండవు



భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తరచుగా పలు మార్లు ఇంటర్వ్యూలలో కీలక ప్రశ్నలకు తెలివైన సమాధానాలు చెప్పి ప్రసిద్ధి చెందారు. ఇప్పుడు కూడా మళ్లీ అదే జరిగింది. శని వారం కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జైశంకర్‌ని ఓ ప్రశ్న అడిగా రు. ఆ క్రమంలో మీకు డిన్నర్ చేసే అవకాశం వస్తే ఉత్తర కొరియా ప్రధాని కిమ్ జోంగ్ ఉన్ లేదా అమెరికన్ వ్యాపా రవేత్త జార్జ్ సోరోస్‌లలో ఎవరితో విందు చేయాలనుకుం టున్నారని ప్రశ్నించారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ ఇప్పుడు నవరాత్రులని, తాను ఉపవాస దీక్షలు చేస్తున్నానని వెల్లడించారు.

**ప్రశంసలు**

విదేశాంగ మంత్రి జైశంకర్ సమాధానానికి అక్కడ ఉన్న ప్రేక్షకులు పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు. విదేశాంగ మంత్రి సమాధానానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన ఇచ్చిన సమాధానానికి జనం పెద్ద ఎత్తున ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెద్ద విమర్శకుడని, అదే సమయంలో భారతదేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో జార్జ్ సోరోస్ జోక్యం చేసుకున్నారని బీజేపీ చాలాసార్లు గతంలో ఆరోపించింది.


**ఎలాంటి చర్చలు ఉండవు**

అంతేకాదు సదస్సు సందర్భంగా పాకిస్తాన్‌తో చర్చలు జరపబోమని విదేశాంగ మంత్రి శనివారం మరోసారి స్పష్టం చేశారు. రాజధానిలో జరిగిన ఒక కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల మంత్రి మాట్లాడుతూ, పాకిస్తాన్ పర్యటన బహుపాక్షిక కార్యక్రమంలో భాగమని అన్నారు. భారత్–పాకిస్తాన్ సంబంధాలపై చర్చించేందుకు తాను అక్కడికి వెళ్లడం లేదన్నారు. తాను మంచి సభ్యునిగా ఉండేందుకు మాత్రమే అక్కడికి వెళ్తున్నట్లు చెప్పారు.

**9 ఏళ్ల తర్వాత విదేశాంగ మంత్రి**

విదేశాంగ మంత్రిగా ఎస్. జైశంకర్ తొలిసారి పాకిస్తాన్‌లో పర్యటించనున్నారు. జైశంకర్ గత ఆరేళ్లుగా ఏళ్లుగా మోదీ ప్రభుత్వంలో నిరంతరం విదేశాంగ మంత్రిగా కొనసాగుతున్నారు. ఉగ్రవాదంపై పొరుగుదేశంతో చర్చలు ఆగిపోయిన 9 ఏళ్లకు విదేశాంగ మంత్రి పాకిస్తాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఇంతకు ముందు సుష్మా స్వరాజ్ విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు చివరిసారిగా ఈ శుత్రదేశంలో పర్యటించారు.

# పాత ప్రసంగాలతో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరు




**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక పరిస్థితికి సంబంధించి ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆదివారంనాడు తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ పదే పదే పాత ప్రసంగాలే పునరావృతం చేసినా దేశ ఆర్థిక వ్యవస్థలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలని కప్పిపుచ్చలేరని అన్నారు. 'మేకిన్ ఇండియా' ఘోరంగా విఫలమైందని తప్పుపట్టారు. ప్రజలపై గృహ రుణాల భారం పెరిగిందని, ధరలు పెరిగాయని, తయారీ రంగం కడగండ్ల పాలైందని అన్నారు. "పదే పదే పాతబడిన ప్రసంగాలతో ఆర్థిక వ్యవస్థలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను మీరు (ప్రధాని) కప్పిపుచ్చలేరు. 2013–14 నుంచి 1022–23 వరకూ గృహ సంబంధిత ఖర్చులు 241 శాతం పెరిగాయి. గృహ రుణం జీడీపీలో 40 శాతం ఆల్‌టైమ్ రికార్డుకు పెరిగింది. హౌస్‌హోల్డ్ సేవింగ్స్ 50 ఏళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయి. భారతీయ కుటుంబాల ఆదాయం కంటే వినియోగం పెరిగింది. గత ఏడాదితో పోల్చుకుంటే హోమ్ కుక్డ్ వెజ్ తాలీ ధర సెప్టెంబర్‌లో 11 శాతం పెరిగింది. ధరలు పెంచేసి అసంఘటిత రంగం దెబ్బతినడానికి బీజేపీనే కారణం. కాంగ్రెస్–యూపీఏ హయాంలో పెరిగిన ఇండియా ఎగుమతుల లాభాలను మీ విధానాలతో విస్మరించారు. దీంతో 10 ఏళ్లలో మేక్ ఇన్ ఇండియా ఘోరంగా విఫలమైంది" అని ఖర్గే సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విమర్శలు గుప్పించారు.

**డైమండ్ వర్కర్ల ఆత్మహత్యలు**

సూరత్‌లోని డైమండ్ వర్కర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని, వారి వేతనం 30 శాతానికి తగ్గిపోయిందని, ప్రధానమైన డైమెండ్ యూనిట్లు అతికష్టంగా వారంలో నాలుగు రోజులే పని చేస్తున్నయని ఖర్గే చెప్పారు. గత ఆరు నెలల్లో 60 మందికి పైగా డైమండ్ వర్కర్లు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డిమాండ్‌ను కృత్రిమంగా తగ్గించి ఆ పేరుతో వేతనాలు జాప్యం చేస్తోందని, విపక్ష పాలిత రాష్ట్రాలకు నిధులివ్వడం లోనూ జాప్యం చోటుచేసుకుంటోందని విమర్శించారు.

## ముంబైలో భారీ అగ్నిప్రమాదం.. ఒకే కుటుంబంలో ఏడుగురి సజీవదహనం



**ముంబై:** మహారాష్ట్రలోని ముంబైలో ఘోర ప్రమాదం చోటుచేసుకున్నది. ముంబైలోని బెంబూర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు సజీవదహనమయ్యారు. బాధితుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బాధితులను సమీపంలోని దవాఖానకు తరలించేలోపే మృతిచెందారని అధికారులు తెలిపారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న షాప్‌లో మంటలు చెలరేగాయని తెలిపారు. క్రమంగా అవి మొదటి అంతస్తుకు వ్యాపించాయన్నారు. ఆ సమయంలో బాధితులంతా గాఢ నిద్రలో ఉండటంతో మరణించారని చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## మెరీనా బీచ్‌లో భారత వైమానిక దళం ఎయిర్ షో..



చెన్నైలోని మెరీనా బీచ్‌లో ఆదివారం భారత వైమానిక దళం మెగా ఎయిర్ షోను ప్రారంభించింది. అక్టోబర్ 8న ఇక్కడ జరగనున్న 92వ వైమానిక దళ దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా ఈ షోను నిర్వహిస్తున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. వైమానిక ప్రదర్శనలో రఫేల్, సు–30, మిగ్, జాగ్వార్, తేజస్ మొదలైన 72 రకాల విమానాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. హెలికాప్టర్‌ల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా వైమానిక దళం అధికారులు పేర్కొన్నారు. భారత వైమానిక దళం గరుడ్ కమాండోలు విన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, తమిళనాడు మంత్రులు, సీనియర్ వైమానిక దళ అధికారులు పాల్గొన్నారు.

# అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన మాజీ సీఎం



**జంషెడ్‌పూర్:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయి సోరెన్ అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గడంతో జంషెడ్‌పూర్‌లోని టాటా మెయిన్ హాస్పిటల్‌లో ఆయనను చేర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని ఆసుపత్రి జీఎం డాక్టర్ సుధీర్ రాయ్ తెలిపారు. కాగా, ఆసుపత్రిలో చేరిన కారణంగా 'మాంఝి పరగణ మహాసమ్మేళన్'కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చంపయి సోరెన్ చెప్పారు. జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్‌ను మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేయడంతో గత ఫిబ్రవరి 2న జార్ఖండ్ ముఖ్యమంత్రిగా చంపయి సోరెన్ పగ్గాలు చేపట్టారు. ఐదు నెలల తర్వాత జూలైలో హేమంత్ సోరెన్ బెయిలుపై విడుదల కావడంతో సీఎం పదవికి చంపయి సోరెన్ రాజీనామా చేశారు. దీంతో తిరిగి హేమంత్ సోరెన్ సీఎం అయ్యారు. ఈ పరిణామలతో అసంతృప్తి చెందిన చంపయి సోరెన్ గత ఆగస్టు 30న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అసోం సీఎం హిమంత బిస్వా శర్మ, జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ సమక్షంలో బీజేపీలో చేరారు. 67 గిరిజన నేత అయిన చంపయి సోరెన్ 'జార్ఖండ్ టైగర్'గా పేరుంది. 1990లో జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన పోరాటం చేశారు. 2000లో బీహార్ నుంచి జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. 1991లో అవిభక్త బీహార్‌లోని సరాయికేల అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత జేఎంఎం టిక్కెట్టుపై 2000, 2005, 2009, 2014, 2019లో వరుసగా గెలుపొందారు.

# వ్యాపారి జాడగల్లంతు.. బ్రిడ్జిపై డ్యామేజీ అయిన కారు



**మంగళూరు:** కర్ణాటకలోని ప్రముఖ వ్యాపారవేత్త బీఎం ముంతాజ్ అలీ ఆదివారం ఉదయం నుంచి కనిపించకుండా పోవడం, ఆయన బీఎండబ్ల్యూ కారు ఒక బ్రిడ్జి వద్ద బాగా డ్యామేజ్ అయి కనిపించడం కలకలం సృష్టించింది. దీనిపై మంగళూరు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. మంగళూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మెయిదీన్ బవ సోదరుడైన ముంతాజ్ అలీ ఆదివారం తెల్లవారుజామున 3 గంటలలో తన ఇంటి నుంచి కారులో బయలుదేరాడని, 5 గంటల సమయానికి కులూర్ వంతెన వద్ద ఆగారని చెబుతున్నారు. ఆయన బీఎండబ్లూ కారు డ్యామేజ్ అయినట్టు కనిపిస్తోందని మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు. ఆయన వంతెన పైనుంచి పక్కనే ఉన్న నదిలోకి దూకేసి ఉండవచ్చనే అనుమానంతో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, కోస్ట్ గార్డ్ బృందాలు రంగంలోకి దిగినట్టు చెప్పారు. "కులూరు వంతెన వద్ద వ్యాపారవేత్త ముంతాజ్ అలీ కారు కనిపించినట్టు తెల్లవారుజామున మాకు సమాచారం వచ్చింది. ఆయన బ్రిడ్జి నుంచి దూకేసి ఉండవచ్చు. స్థానిక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు జరుపుతున్నారు" అని అనుపమ్ అగర్వాల్ తెలిపారు. కారు ప్రమాదానికి గురైనట్టు అనుమనిస్తున్నామని అన్నారు. తన తండ్రి కనిపించడం లేదని అలీ కుమార్తె తెల్లవారుజామున పోలీసులకు సమాచారం ఇచ్చిందన్నారు. దర్యాప్తు తరువాత మరిన్ని వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

## 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలి: రాహుల్

**కొల్హాపూర్:** రాజ్యాంగ పరిరక్షణకు రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించాలని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇందు కోసం పార్లమెంటులో చట్టాల ఆమోదానికి కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కొల్హాపూర్‌లో జరిగిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ, దేశంలో కులగణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందువల్ల ప్రతి కులంలో ఎంతమంది జనాభా ఉన్నారనేది తెలియడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థపై వారికి ఏమేరకు నియంత్రణ ఉందనేది తెలుస్తుందని అన్నారు. "దేశ జనాభాలో 90 శాతం మందికి అవకాశాల తలుపులు మూసేశారు. జనాభాలోని ఒక చిన్నపాటి వర్గమే కీలకమైన విధాన నిర్ణయాలపై ఆధిపత్యం చెలాయిస్తోంది. దేశ జనాభాలో కనీసం 50 శాతం మంది ఓబీసీలు ఉన్నారు. 90 మంది టాప్ ఐఏఎస్ అధికారుల్లో ఈ వర్గం నుంచి కేవలం ముగ్గురే ఉన్నారు. అదేవిధంగా దళితులు, ఆదివాసీలు కలిసి జనాభాలో 23 శాతం ఉన్నారు. కీలక పదవుల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. దళితులు ముగ్గురు, ఆదివాసీలు ఒకరు ఉన్నారు. ఈ వాస్తవాన్ని మరుగుపరచేందుకే జనగణనను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. ఈ వర్గాలను అణగదొక్కేందుకే దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన చరిత్రను పాఠ్యాంశాలలోంచి కనుమరుగు చేస్తున్నారని అన్నారు.

## భూమికి మరో ముప్పు



త్వరలోనే భారీ సౌర తుఫాను భూమిని తాకనున్నది. ఇది కమ్యూనికేషన్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నాసా హెచ్చరించింది. సూర్యుడి ఉపరితలంపై పేలుళ్లు సంభవిస్తుంటాయి. దాని కారణంగా ఏర్పడే కణాలు, అయస్కాంత క్షేత్రాలు, ఇతర పదార్థాలతో కలిసి అవి భూమి వాతావరణాన్ని తాకుతుంటాయి. దీన్నే సౌర తుఫానుగా పేర్కొంటుంటారు. ఇది ఉపగ్రహాలతో పాటు టెలికమ్యూనికేషన్స్‌కు అంతరాయం కలిగించే ఛాన్స్ ఉంటుందని నాసా పేర్కొంది. ఈ సౌర తుఫానును ఇస్రో శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని భారత ఉపగ్రహ ఆపరేటర్స్‌ని భారతీయ అంతిరక్ష పరిశోధనా సంస్థ అప్రమత్తం చేసింది. సౌర తుఫాను నేపథ్యంలో రాబోయే కొద్దిరోజులు కీలమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ సౌర తుఫాను భారత్‌పై ఎక్కువగా ప్రమాదం ఉండదని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ డైరెక్టర్ డాక్టర్ అన్నపూర్ణి సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇంతకు ముందు వచ్చిన సౌర తుఫాన్‌తో సమానంగా ఉంటుందని చెప్పారు. తాజాగా వచ్చే తుఫాను భూమిని తాకేందుకు మరికొద్ది రోజుల సమయం ఉందన్నారు. భారత్‌పై పెద్దు ప్రభావం ఉండకపోవచ్చన్న ఆయన.. కొంత సమయం వేచి చూడాల్సిందేనని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది మే మాసంలోనూ బలమైర సౌర తుఫాను భూమిని తాకిన విషయం విధితమే.

## డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే.. డబుల్ లూటీ..



డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే.. డబుల్ లూటీ అంటూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికార బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆదివారం జనతా కీ అదాలత్ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ సీఎం మాట్లాడుతూ ఢిల్లీ ప్రజల ప్రేమ, మద్దతు, నమ్మకమే నా నిజాయితీకి నిదర్శనమన్నారు. యూపీలో గత ఏడేళ్లుగా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని.. అక్కడ విఫలమయ్యారన్నారు. 22 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయని.. ఉచిత విద్యుత్ అందిస్తున్న రాష్ట్రం పేరు చెప్పమని వారిని అడగాలన్నారు. గుజరాత్‌లో 30 సంవత్సరాలుగా అధికారంలో ఉన్నారని.. అక్కడ ఒక్క బడిని కూడా బాగు చేయలేదంటూ విమర్శించారు. అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్నాయని.. అక్కడ చేసిన మంచి పని ఒక్కటి చెప్పాలన్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ రిటైర్ అవుతారన్నారు. ఢిల్లీలో చేసిన ఏ ఒక్క పనైనా 22 రాష్ట్రాల్లో ఒక్క ఏడాదిలో చేయాలన్నారు. పదేళ్లలో చేసింది ఏమీ లేదని.. 11వ సంవత్సరంలోనైనా ఏదో చేశారనుకుంటారన్నారు. ఢిల్లీ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని తాను ప్రధానికి చెబుతున్నానని.. ఫిబ్రవరిలో 22 రాష్ట్రాల్లో ఒక్కడో ఒక చోట ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. అలా చేస్తే తానే ఎన్నికల్లో మోదీకి ప్రచారం చేస్తానన్నారు. ఢిల్లీ సీఎం అతిషీ మాట్లాడుతూ అత్యంత వేడిలోనూ 24 గంటలు కరెంటు అందుబాటులో ఉన్న ఏకైక ప్రదేశం ఢిల్లీ మాత్రమేనన్నారు. అయినా బిల్లులు జీరో వచ్చాయన్నారు. ఇది అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ అని.. బీజేపీ వ్యతిరేక పార్టీ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని మురికివాడలను ఒక్కొక్కటిగా కూల్చివేస్తోందన్నారు. ఆరు నెలల కిందట వృద్ధాప్య పింఛను నిలిపివేసిందని విమర్శించారు.

## గోవాలో ఉద్రిక్తత.. మతపరమైన వ్యాఖ్యలు చేసిన ఆర్ఎస్ఎస్ నేతను అరెస్టు చేయాలని క్రైస్తవులు డిమాండ్



**పనాజీ:** బీజేపీ పాలిత రాష్ట్రమైన గోవాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నేత సుభాష్ వెలింగ్‌కర్, క్యాథలిక్ మిషనరీ సెయింట్ ఫ్రాన్సిస్‌పై చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై క్రైస్తవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. ఆర్ఎస్ఎస్ నేతను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఓల్డ్ గోవాలో కూడా స్థానికులు, రాజకీయ నేతలు నిరసనకు దిగారు. దక్షిణ గోవాలోని మార్గోవ్ నగరంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి వేళ మార్గోవ్‌లోని జాతీయ రహదారిని ఆందోళనకారులు దిగ్బంధించారు. అలాగే పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో ఐదుగురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ప్రజలు శాంతి వహించాలని, సంయమనం పాటించాలని గోవా చర్చి అధికారులు పిలుపునిచ్చారు. కాగా, ఓల్డ్ గోవాలోని చర్చికి సంబంధించిన సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్‌ను విమర్శించిన ఆర్ఎస్ఎస్ గోవా మాజీ చీఫ్ సుభాష్ వెలింగ్‌కర్‌పై 12కుపైగా కేసులు నమోదయ్యాయి. అయితే పోలీసులు ఆయనను ఇంకా అరెస్ట్ చేయలేదు. శనివారం స్థానిక కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను వెలింగ్‌కర్ దాఖలు చేశారు. అయితే అరెస్టు నుంచి మధ్యంతర ఉపశమనం ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. పిటిషన్‌పై విచారణను సోమవారానికి వాయిదా వేసింది. మరోవైపు గోవా పరిణామాలపై కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ స్పందించారు. బీజేపీ పాలనలోని గోవాలో మత సామరస్యంపై దాడి జరుగుతున్నదని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉద్దేశపూర్వకంగా మతపరమైన ఉద్రిక్తతలను రేకెత్తిస్తున్నాయని ఆరోపించారు.

## అకాలీదళ్ నేతతో ఘర్షణ.. ఆప్ నాయకుడిపై కాల్పులు

**చండీగఢ్:** శిరోమణి అకాలీదళ్ నేత, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇది వారిద్దరి మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఆప్ నాయకుడిపై అకాలీదళ్ నేత కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆప్ నేతను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శిరోమణి అకాలీదళ్‌కు చెందిన మాజీ ఎంపీ జోరా సింగ్ మాన్ కుమారుడు వర్దేవ్ సింగ్ నోని మాన్ శనివారం తన అనుచరులతో కలిసి పాఠశాలకు సంబంధించిన ఫైల్ క్లియర్ చేయమని అడిగేందుకు బీడీపీవో కార్యాలయానికి వచ్చాడు. అయితే అధికారి నిరాకరించడంతో ఆగ్రహంతో బయటకు వెళ్లాడు. కాగా, బీడీపీవో కార్యాలయం బయట ఉన్న ఆప్ నేత మన్‌దీప్ సింగ్ బ్రార్‌తో వర్దేవ్ సింగ్ వాగ్వాదానికి దిగాడు. ఈ సందర్భంగా వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన వర్దేవ్ సింగ్ తన వద్ద ఉన్న గన్‌తో ఆప్ నేత మన్‌దీప్ సింగ్, అతడి అనుచరులపై కాల్పులు జరిపాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆప్ నేతను జలాలాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పంచాయతీలకు నిధుల కటకట!

-మొదటిపేజీ తరువాయి

పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిధులు లేక గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త సేకరించే ట్రాక్టర్లకు కనీసం డీజిల్ కూడా పోసే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు దవాఖాన పాలవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం, పచ్చదనం, బతుకమ్మ, దసరా పండగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారిందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



## నాడు ఎట్లుండె.. నేడు ఏమైంది?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చింది. కేంద్రం నుంచి వచ్చే నిధులకు అంతే మొత్తంలో జమ చేసి నెలకు రూ.250 కోట్లకుపైగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసేవారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు సాఫీగా జరిగేవి. గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో చూడముచ్చటగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. నిధుల విడుదల ఆగిపోవడంతో అన్ని పనులు బంద్ అయ్యాయి. గత పది నెలల్లో పంచాయతీలకు దాదాపు రూ.2,500 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద దాదాపు మరో రూ.1,300 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉన్నదని మాజీ సర్పంచ్‌లు చెప్తున్నారు. తాము అనేకసార్లు ప్రభుత్వాన్ని, గవర్నర్‌ను, ప్రతిపక్షాలను కలిసినా ఫలితం లేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులే చిన్నచిన్న పనులకు కూడా నిధులు లేకపోవడంతో వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి పెడుతున్నారు. ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుంటే వాటిని ఎలా తీర్చాలోనని మధనపడుతున్నారు.

## గాడి తప్పిన పాలన

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతున్నది. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనుల కోసం బ్లీచింగ్ పౌడర్, చెత్త సేకరణ, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు, ట్రాక్టర్లకు డీజిల్ కొరత తదితర సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ప్రత్యేకాధి కారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# మూసీ ప్రక్షాళన చేసి తీరతాం

-మొదటిపేజీ తరువాయి

పేదల మధ్యనే ఉంటూ.. వారి ఇబ్బందులు తెలుసుకోలేనా? అని అన్నారు. ఇల్లు కోల్పోయిన నిరుపేద కుటుంబాల బాధలు తనకు అర్థమవుతాయన్నారు. ఆదివారం.. రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, సివిల్, ఈఎన్సీ, మిషన్ భగీరథ, ప్రజారోగ్య, మునిసిపల్, గిరిజన సంక్షేమ, ఆర్అండ్‌బీ విభాగాలకు సంబంధించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైన 1,635 మందికి ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా శిల్పకళా వేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. “గంగా, యమున, సరస్వతి, కావేరి వంటి నదుల పేర్లను మన ఆడబిడ్డలకు పెట్టుకుంటున్నాం. మూసీ నది కంపు కొడుతూ, విషం చిమ్ముతుంది కాబట్టే ఆపేరు ఎవరూ పెట్టుకోవడంలేదు. ఆ మూసీ మురికిని నేను ప్రక్షాళన చేయాలనుకుంటున్నా. ఇందులో యువ ఇంజనీర్లు భాగస్వామ్యమై ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి. గతంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు నిర్వాసితులు కాలేదా? మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను కొట్టించారు కదా? మూసీ పరివాహక ప్రాంతాల్లో పదివేల కుటుంబాలున్నాయి. నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సలహా ఇవ్వండి. నష్ట పరిహారం ఎలా ఇద్దామో చెప్పండి. ఇప్పటికే గుడిసెల్లో ఉన్నవారిని డబుల్ బెడ్రూమ్ ఇళ్లల్లోకి తరలిస్తూ.. దారి ఖర్చులకు కూడా రూ.25 వేలు ఇస్తున్నాం. బఫర్ జోన్‌లో ఉన్నవారిని ఎలా ఆదుకోవాలన్న దానిపై ఆలోచిస్తున్నాం.

## 10 వేల కోట్లు ఖర్చు చేయగలిగితే..

నువ్వు(కేసీఆర్) రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినవ్. రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్లు మూసీలో ఉన్న పేదలకు ఖర్చు చేయగలిగితే.. వాళ్లకు ప్రభుత్వ స్థలాల్లో కాలనీ, అపార్టుమెంట్లు, మంచి ఇళ్లు కట్టించి, హాస్పిటల్, పాఠశాలలు, కాలేజీలు కట్టించవచ్చు. మీకు రూ.2 వేల కోట్ల విలువ చేసే వెయ్యెకరాల ఫామ్‌హౌస్ ఉంది. మీ పార్టీ ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయి. పార్టీ పెట్టినపుడు 15 రూపాయల్లేవు.. ఇప్పుడు ఇన్ని కోట్లు మీ ఖాతాలకు రావడానికి పేదోళ్ల త్యాగం కారణం కాదా? ఈ ప్రభుత్వం మనందరిది. ఉద్యోగాలు సాధించిన వారంతా బాధ్యతతో పనిచేయండి. మనం చేసే నిర్మాణం పూర్తయితే వాళ్లు చేసిన దోపిడీ అంతా ప్రజలకు తెలుస్తుందని.. ముందుకు సాగనియ్యకుండా ప్రయత్నం చేస్తున్నారు. బుల్డోజర్ నా మీదుగా పోవాలంటే.. నా మీదుగా పోవాలంటూ హరీశ్‌రావు, కేటీఆర్.. ఇలా అందరూ పోటీ పడుతున్నారు. మీకోసం ఎన్ని బుల్డోజర్లు కొనాలె? పైసలు యాడున్నయి? మూసీ అంచున ఉండే దోస్తులకు ఒకటే సూచన. హరీశ్, కేటీఆర్, రాజేందర్ ఎవరైనా వస్తే పట్టుకొని ఒక వారం రోజులు పేదోళ్ల మధ్యన ఉంచండి. వాళ్ల కష్టాలు తెలుస్తయి. వాళ్లకు ఏం మేలు చేయాలో అప్పుడు అర్థమవుతుంది. ఏం చేసినా తప్పుబట్టాలని, కాళ్ల మధ్య కట్టె పెట్టాలని కొంతమంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. మనం పైసలు పెట్టి పని చేస్తే.. తెలంగాణ బాగుపడితే.. గతంలో వాళ్లు చేసిన దోపిడీ ప్రజలకు అర్థమవుతుందని అన్నింటినీ అడ్డుకుంటున్నారు.

## వందేళ్ల అనుభవం..!

వందేళ్ల అనుభవం ఓవైపు ఉంటే.. పదేళ్ల దుర్మార్గమైన అనుభవం మరోవైపు ఉంది. కాంగ్రెస్ పాలనకు, బీఆర్ఎస్ పాలనకు ఎంతో వ్యత్యాసం ఉంది. గత ప్రభుత్వం 2017లో నోటిఫికేషన్ ఇచ్చి ప్రిన్సిపాళ్లను, పీఈటీలను ఎందుకు నియమించలేదు? 2019 పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన వినోద్‌కుమార్‌కు, కవితకు ఆరు నెలలు తిరగకుండానే పదవులు కట్టబెట్టారు. వారి కుటుంబానికి ఒక నీతి, మన కుటుంబాలకు మరో నీతి ప్రదర్శించారు. ఇదే ఆ కుటుంబం రీతి. వివిధ శాఖల్లో కొన్ని ఉద్యోగాలకు 2017లో నోటిఫికేషన్ ఇస్తే.. మరికొన్ని రెండేళ్ల కిందట నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ, ఉద్యోగ నియామకాల గురించి మాత్రం పట్టించుకోలేదు. వివిధ న్యాయస్థానాల్లో కేసులుంటే వాటికి పరిష్కారం చూపించలేకపోయారు. కొందరు ఎనిమిదేళ్లు, మరికొందరు రెండేళ్లుగా నిరీక్షించి గత ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయారు. నేనిచ్చిన పిలుపుతో మీరంతా కాంగ్రెసకు అండగా నిలబడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగులు.. కాంగ్రెస్ కార్యకర్తల కన్నా ఎక్కువగా శ్రమించడం వల్లే 65 మంది ఎమ్మెల్యేలతో అధికారం చేపట్టాం. ఇచ్చిన మాట ప్రకారం.. పదేళ్లలో చేపట్టని నియామకాలకు పరిష్కారం చూపి పది నెలల్లో 60 వేల ఉద్యోగ నియామకాలు పూర్తిచేశాం. యువ ఇంజనీర్ల పర్యవేక్షణంలో 360 కి.మీ రీజనల్ రింగ్‌రోడ్డు, రేడియల్ రోడ్డు, ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ నిర్మాణం, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ ద్వారా పలు నిర్మాణాలు చేపట్టనున్నాం.

## ముఖం చెల్లక ఆయనెక్కడున్నారో..?

ప్రతి ఒక్కరూ ముసుగు తొడుక్కుంటారు. ఆయనకు (కేసీఆర్‌ను ఉద్దేశించి) తెలంగాణ అనే ముసుగు.. రక్షణ కవచంలా కొంతకాలం ఉంది. ఉద్యమం కోసం మీరంతా చేతులెత్తి దండం పెట్టారు. అది వారి గొప్పతనం కాదు.. తెలంగాణ ఉద్యమం గొప్పతనం.. విద్యార్థులు, నిరుద్యోగుల త్యాగం. ఇవాళ ముసుగు తొలగిపోయింది కాబట్టి ముఖం చెల్లక ఆయన ఎక్కడున్నారో! భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వరకు మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సమయంలో కట్టిన ప్రాజెక్టులు ఎన్ని వర్షాలు పడినా, వరదలు, తుఫాన్లు, ఉప్పెనలు వచ్చినా.. చెక్కుచెదరలేదు. కాళేశ్వరం కడితే ఏం జరిగిందో చూశారు. కాళేశ్వరం కట్టిన వాళ్లను ఆదర్శంగా తీసుకుంటరా? గతంలో నిర్మించిన ప్రాజెక్టుల ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకుంటరా? రూ.38 వేల కోట్ల అంచనాలున్న ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు.. పేరు మారి రూ.లక్షన్నర కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు అయింది. దానికి రూ.లక్ష కోట్లు చెల్లించారు. మూడో టీఎంసీకి ఇంకా పనులు పూర్తికాలేదు. ఇక మల్లన్నసాగర్‌లో రిజర్వాయర్ నిర్మించిన చోట భూమిలో వర్టికల్ చీలిక ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు చెబుతున్నారు. 50 టీఎంసీల నీళ్లు నింపినరోజు అది కుంగిపోయి భూకంపం వచ్చి ఊర్లకు ఊర్లు తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని చెప్పారు. గత ప్రభుత్వం 15 టీఎంసీల కంటే ఎక్కువ నీళ్లు నింపలేదు.

## రాజేందరన్నా వాళ్లకు బానిసత్వం చూపించకు!

అంగి మారినా ఈటల రాజేందర్‌కు ఆ వాసన మాత్రం మారినట్లు కనబడటంలేదు. మంచి పనుల్లో ఆయన కలిసి వస్తారనుకున్నాం. మూసీపై ముందురోజు హరీశ్, కేటీఆర్ మాట్లాడితే.. మరుసటిరోజు రాజేందర్ జిరాక్సు తెచ్చి మాట్లాడారు. కనీసం భాష అయినా మార్చుకో రాజేందరన్నా! ఇంకా వాళ్లకు బానిసత్వం చూపించాల్సిన అవసరంలేదు. వాళ్లు నిన్ను మెడలు పట్టి గెంటేసినప్పుడు తెలంగాణ సమాజం నీ పక్కన నిల్చున్నది. ఆ దొంగల పక్కన నిల్చోకు. తెలంగాణ ప్రజల పక్కన ఉండు. నేను ఢిల్లీకి వెళ్తున్నా. రేపు మోదీ దగ్గరకు వెళ్దాం.. సబర్మతి రివర్ ఫ్రంట్ కోసం 64 వేల కుటుంబాలను ఆయన బయటకు పంపారు. రూ.25 వేల కోట్లు మూసీ రివర్ డెవల్‌పమెంట్ ఫ్రంట్ కోసం మోదీని అడుగుదాం. ఎందుకియ్యరు? మనం పన్ను కడతలేమా? సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్, అన్నీ మీరే గెలిస్తిరి. మీకు బాధ్యతలేదా?” అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి

విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేయబోతున్నామని తెలిపారు.

ఓ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నమూనా విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రూ.5 వేల కోట్లతో ఈ స్కూల్ కాంప్లెక్స్ ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది నుంచే అన్ని నియోజకవర్గాల్లో స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు రాష్ట్ర ప్రజలకు దసరా కానుక అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థులను పట్టించుకోలేదని విమర్శించారు. చదువుకుంటే బాగుపడతారనేది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో 20-25 ఎకరాల్లో రెసిడెన్షియల్ స్కిల్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఒక్కో పాఠశాలకు రూ. 25 నుంచి 26 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు చాలా రెసిడెన్షియల్ స్కూళ్లకు పక్కా భవనాలు లేక అద్దె భవనాలు ఉన్నాయని చెప్పారు. ఒకటోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే దగ్గర బోధన చేస్తున్నారని అన్నారు. గత మూడు నెలలుగా రెసిడెన్షియల్ స్కూళ్లపై కసరత్తు చేశామన్నారు.



ప్రస్తుత రెసిడెన్షియల్ స్కూలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. 662 స్కూళ్లకు పక్కా భవనాలు లేవని అన్ని అద్దె భవనాలేనని చెప్పారు. ఈ ఏడాది 5 వేల కోట్ల రూపాయలు రెసిడెన్షియల్ స్కూళ్లకు ఖర్చు చేస్తామని అన్నారు. కులమత, లింగ భేదం లేకుండా రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఉంటాయని స్పష్టం చేశారు. పేద పిల్లలు తాము ఏదో మిస్సవుతున్నామని అనుకోకూడదని అన్నారు. అవసరమైతే ప్రతీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్మాల్ థియేటర్ కడుతామని అన్నారు.

ఈనెల 11న సాధ్యమైనన్ని పాఠశాలలకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఇప్పటికే 24 నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక పూర్తయిందని అన్నారు. వీలైనంత త్వరగా ప్రతీ నియోజకవర్గంలో ఒక రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. 7 నెలల్లో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల నియామకం సొసైటీ ద్వారా జరుగుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## పోలీస్ శాఖలో ప్రక్షాళన...

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** తెలంగాణలో పోలీస్ ప్రక్షాళన షురూ అయ్యింది. అక్రమ దందాకు వత్తాసు పలుకుతున్న పోలీసు అధికారులపై వేటు పడింది. మల్టీజోన్-2 లోని తొమ్మిది జిల్లాలలో అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను విఆర్ లో పెడుతూ మల్టీజోన్-2 ఐజీపీ వి. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే సదరు అధికారులను బదిలీ చేయడం జరిగింది.ప్రస్తుతం వేటు పడినవాళ్ళలో సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సీఐలతోపాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(రా), పెన్ పహాడ్, వాడపల్లి, హాలియా, ఎస్ఐలను విఆర్ లో పెట్టారు. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్ష సహకారం ఉండటంతో వారిపై డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. త్వరలో వీరిని లూప్ లైన్‌కు ట్రాన్స్‌ఫర చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వయిరీల ఆధారంగా ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు.ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. అదేవిధంగా వాగుల్లో, నిషేధిత నది ప్రాంతాలలో ఎక్కడబడితే అక్కడ విచక్షణ రహితంగా ఇసుకను తవ్వకాలు జరుగుతున్నాయి.

## సికింద్రాబాద్ నుంచి గోవాకు కొత్త రైలు..

-మొదటిపేజీ తరువాయి

సికింద్రాబాద్-వాస్కోడగామా (17039) రైలు ప్రతి బుధ, శుక్రవారాల్లో.. వాస్కోడగామా-సికింద్రాబాద్ (17040) రైలు ప్రతి గురు, శనివారాల్లో బయల్దేరుతాయి. ప్రస్తుతం సికింద్రాబాద్-వాస్కోడగామా మధ్య రెగ్యులర్ సర్వీసు (17603) అందుబాటులో ఉంది. అది, మంగళ, బుధ, శుక్ర వారాల్లో ఇది నడుస్తోంది. ప్రయాణికుల నుంచి తీవ్ర డిమాండ్ ఉండటంతో ఈ రైలు ఎప్పుడూ కిటకిటలాడుతుంది. హైదరాబాద్ నుంచి వాస్కోడగామాకు మరో రైలు (17021) ఉంది. కానీ ఈ రైలు వారంలో ఒక రోజు మాత్రమే నడుస్తుంది. ఈ రైలులో టికెట్లు దొరకడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో కొత్త రైలు పర్యాటకుల ప్రయాణ అవకాశాల్ని పెంచనుంది. అదనంగా సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

## కాంగ్రెస్ మోసాలపై చర్చించండి..


-మొదటిపేజీ తరువాయి



చేయలేకపోగా, మీ ఊళ్లలో అవ్వాతాతలకు పెంచుతామన్న పింఛన్ పెంచలేదన్నారు. రుణమాఫీ పూర్తి చేయలేదని.. రైతు బంధును నిలిపివేశారని.. రైతు భరోసా దిక్కులేకుండా పోయింది, బోనస్‌ను బోగస్ చేశారని ఆరోపించారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అన్నారని.. పది నెలలు గడిచినా అతీగతి లేదన్నారు. నాలుగు వేల నిరుద్యోగ భృతికి నీళ్లు వదిలారని విమర్శించారు. ఈ దసరాకు మీ ఊళ్లకు వస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో అలాయ్ - బలాయ్ తీసుకుంటూ కాంగ్రెస్ చేసిన మోసాల గురించి చర్చించాలని పిలుపునిచ్చారు. మీ ప్రాంతాల్లోని కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీలతో పాటు, రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మైనారిటీ డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్‌లపై ఎక్కడిక్కడ నిలదీయాలన్నారు.

## వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా.. ముఖ్యమంత్రికి సోయి లేదు

-మొదటిపేజీ తరువాయి



పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం చోటుచేసుకున్నది చెప్పారు. వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ముఖ్యమంత్రికి చలనం లేదని, ప్రభుత్వానికి బాధ్యత లేదని ఫైరయ్యారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన సీఎం రేవంత్ కు రైతన్నల చేతిలో దండన తప్పదని హెచ్చరించారు. అన్నదాతలు ఆత్మస్థయిర్యం కోల్పోవద్దని కోరారు. ముంచే రోజులు తొందర్లోనే పోతాయని, మంచి రోజులు మళ్లీ వస్తాయంటూ ట్వీట్ చేశారు. “పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నారు. కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారు. ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణం. ఓవైపు సాగునీటి సంక్షోభం. మరోవైపు రుణమాఫీ ద్రోహం. ఇంకోవైపు రైతుభరోసా మోసం. కౌలు రైతులకూ అందని సాయం. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం. వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా చలనం లేదు. ముఖ్యమంత్రికి సోయి లేదు.. ప్రభుత్వానికి బాధ్యత లేదు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన.. సీఎం రేవంత్ కు రైతన్నల చేతిలో దండన తప్పదు. అన్నదాతలారా ఆత్మస్థయిర్యం కోల్పోకండి. ముంచే రోజులు పోతాయ్.. మళ్లీ మంచిరోజులొస్తాయ్.”

## త్వరలోనే నూతన రెవెన్యూ చట్టం తీసుకొస్తాం



**హైదరాబాద్ :** రాబోయే కొద్ది రోజుల్లో ఆర్వోఆర్ 2024 చట్టం తీసుకురాబోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని డిప్యూటీ కలెక్టర్లు, 257 రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారులు, 970 తహసీల్దార్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇబ్బందులు పడకుండా ఈ చట్టం దేశంలోనే ఆదర్శంగా ఉండబోతుందన్నారు. అధికారుల నుంచి సూచనలు, సలహాలు ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10,900 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ప్రతి రెవెన్యూ విలేజ్‌కు రెవెన్యూ అధికారిని నియమించాలని అధికారులు కోరుతున్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రితో సమావేశమై ఇంకా అనేక అంశాలు చర్చిస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో 2024 %=ూ=% తీసుకురాబోతున్నాం. భూములు ఉన్న ప్రతి ఒక్క ఆసామికి భరోసా ఇవ్వాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మంచి పాలన ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు.

## సీఎం రేవంత్‌కి ఎంపీ ఈటల ఘాటు లేఖ

**హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం హైడ్రాను ఏర్పాటు చేసింది. దీని ద్వారా అక్రమ నిర్మాణాలు.. నదీ గర్భంలో అక్రమంగా నిర్మించిన నిర్మిణాలు కూల్చివేతలో దూకుడుగా వ్యవహరిస్తుంది. దీంతో ఇళ్లు కోల్పోయిన బాధితుల ఆవేదనను రేవంత్ రెడ్డి సర్కార్ పట్టించుకోవడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాంటి వేళ సీఎం రేవంత్ రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆదివారం బహిరంగంగా లేఖాస్త్రం సంధించారు. తాను అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పేదల అభ్యున్నతే లక్ష్యంగా కొట్లాడే వ్యక్తినని ఆయన స్పష్టం చేశారు. హైడ్రా సంస్థకు, హైదరాబాద్ ముంపు గురికాకుండా చూసేందుకు, మూసీ ప్రక్షాళనకు, మూసీను కొబ్బరినీళ్లలా చేసేందుకు, ఎకలాజికల్ బాలన్స్ కాపాడడానికి, విదేశీ పక్షులు రావడానికి, చేపలు పెంచడానికి, పిల్లలు ఈతకొట్టేల చెరువులు తయారు చేయడానికి నేను వ్యతిరేకం కాదని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చెరువు కన్నతల్లి లాంటిదని ఆయన అభివర్ణించారు. కానీ హైదరాబాద్‌లో ఉన్న ఏ చెరువు కూడా పక్షులకు, చేపలకు నిలయంలాగా లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కన్నతల్లి లాంటి ప్రేమను పంచి పాలలాంటి నీళ్లను ఇచ్చి జీవం పోసిన చెరువు ప్రస్తుతం భూగర్భంలో విషాన్ని నింపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి దుర్వాసననిస్తుందని చెప్పారు. ఆయా పరిసర ప్రాంతాల్లో ప్రజల రోగాలకు నిలయంగా మారిందన్నారు. ముందు ఈ చెరువుల్లో దుర్గంధాన్ని తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలా చేయకుండా.. 4 దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, ప్రభుత్వం అనుమతించిన లే అవుట్‌లలో ఇల్లు నిర్మించుకున్న నిరుపేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ మీరు చేస్తున్న అడ్డగోలు కూల్చివేతలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని ఎంపీ ఈటల కుండ బద్దలు కొట్టారు. వారు గొల్లున ఏడుస్తునా, కాళ్ళమీద పడ్డా వదిలిపెట్టడం లేదన్నారు. వారు కడుపు కాలి మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డబ్బులు ఇస్తే కాదు.. పేదల చిరకాల స్వప్నం ఇళ్లు.. దొంగలలాగా దాడి చేసి మీరు చేస్తున్న కూల్చివేతలు.. ఇస్తున్న నోటీసులు ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ రాసిన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలంటూ సీఎం రేవంత్‌కు ఈ సందర్భంగా ఈటల రాజేందర్ సూచించారు. ముఖ్యమంత్రిగా మీకేమీ అపరిమిత అధికారాలు లేవని

# రైతు భరోసా అందకుండానే ముగిసిన సీజన్



**నిజామాబాద్ :** రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం చేయిచ్చింది. వానాకాలం వ్యవసాయ సీజన్ ముగిసిపోయింది. అంటే సాగు భూముల్లో పంటల సాగు ముగిసింది. కానీ, ప్రభుత్వం నుంచి రైతులకు అందాల్సిన పంటల పెట్టుబడి సాయం రైతు భరోసా అందనేలేదు. అసలు జిల్లాల వ్యవసాయ శాఖకు ప్రభుత్వం నుంచి రైతు భరోసా విషయంలో ఎలాంటి ఆదేశాలు అందలేదు. తెలంగాణ కొత్త రాష్ట్రంలో 2014 లో తొలిసారి అధికారంలోకి వచ్చిన నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్ కు ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు సీజన్ల ( ఖరీఫ్, రబీ)కు రూ.10వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతు బంధు పేరును అందించింది. నిరాటంకంగా కొనసాగింది. 2023 చివరన తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టి 10 నెలలు గడిచిపోయినా.. ఇంతవరకూ నయా పైస రైతులకు పెట్టుబడి సాయంగా అందించలేదు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చి, రూ.5వేల స్థానే ఎకరాకు రూ.7500 చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ.15000 అందిస్తామని ఎన్నికల హామీల్లో పేర్కొంది. రైతు రుణ మాఫీకే నిధులన్నీ హరించుకుపోవడం తో రైతు భరోసా డబ్బులు వేయేలేదేమోన్న అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. రైతు రుణ మాఫీలో తలమున కలైన బ్యాంకర్లు, చివరకు పంట రుణాలనూ సకాలంలో ఇవ్వలేక పోయారు. పంట రుణాలు అందక, ప్రభుత్వం నుంచి పంటల పెట్టుబడి కోసం అందాల్సిన రైతు భరోసా సాయం అందక చివరకు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రైతులు అప్పులు చేసి పంటలు సాగుచేసుకున్నారని రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.రైతు భరోసాకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కనీసం రైతు భరోసాకు సంబంధించిన సమాచారం కూడా లేదంటున్నారు. ఇపుడు రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ పంటల సర్వే లో నిమగ్నమై ఉంది. పంటల సాగు వివరాలతో డిజిటల్ సర్వే పనులు నడుస్తున్నాయి. ఈ వివరాలన్నీ సేకరించాక ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొంటున్నారు. రైతు భరోసాకు ఎలాంటి రైతులు అర్హులు అన్న అంశాన్ని తేల్చేందుకు ప్రభుత్వం మంత్రుల ఉప సంఘాన్ని కూడా నియమించింది. ఈ కమిటీ నియామకైన రెండు వారాలకే ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని, ఆ నివేదిక అందాక అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఇది జరిగి రెండు నెలల గడువు ముగిసినా.. ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఈ లోగా వ్యవసాయ సీజన్ ముగిసింది పోయింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్లో 10.50 లక్షల పైచిలుకు ఎకరాల్లో పంటలు సాగుచేశారు. ఇందులో 5.40 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైతే, 5.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. గత ప్రభుత్వ హయాంలోని గణాంకాల మేరకు 5.42 లక్షల పైచిలుకు రైతులకు పంటల పెట్టుబడి సాయం అందేది. అప్పటి లెక్కల ప్రకారం జిల్లాలో రెండు సీజన్లకు కలిపి రమారమి రూ.1250 కోట్లు రైతు బంధు కింద అందేది. ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ.10వేలు అందిస్తే అంత మొత్తం ఖర్చయ్యేది. ప్రస్తుతం ప్రభుత్వం ఎకరాకు రూ.7500 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో రెండు సీజన్లకు ఎకరాకు రూ.15000 ఖర్చు చేయాల్సి వచ్చేది. అంటే, రూ.1875 కోట్లు రైతు భరోసా సాయం అందాల్సి ఉండింది. కానీ, సీజన్ ముగిసిపోయినా ఎలాంటి సాయం అందకపోవడంతో ఆ మేర జిల్లా రైతాంగం నష్టపోయినట్టేనని అభిప్రాయపడుతున్నారు.

# మైలేజ్... డ్యామేజ్...

**వరంగల్ :** ప్రస్తుతం తెలంగాణ రాజకీయం అంతా కొండా సురేఖ చుట్టూ తిరుగుతోంది. ఇటు కాంగ్రెస్.. అటు సినిమా ఇండస్ట్రీ నుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నా.. బీఆర్ఎస్ మాత్రం వ్యూహాత్మకంగా మౌనంగా ఉంది. దీంతో బీఆర్ఎస్‌కు పొలిటికల్ మైలేజ్.. కాంగ్రెస్‌కు డ్యామేజ్ అనే చర్చ జరుగుతోంది.కొండా సురేఖ.. ఒకప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫైర్ బ్రాండ్ లీడర్. కొండా ఫ్యామిలీ అంటే అదో రకమైన ఫీలింగ్ జిల్లా ప్రజలకు ఉండేది. కొండా దంపతులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి వెళ్లినప్పుడు చాలామంది వ్యతిరేకించారు. అనేక రాజకీయ పరిణామాల మధ్యలో కొండా ఫ్యామిలీ మళ్లీ హస్తం గూటికి చేరింది. అందరూ అనుకున్నట్టే సురేఖ విజయం సాధించి.. మంత్రి కూడా అయ్యారు.ఇక్కడిదాకా అంతా బాగానే ఉన్నా.. అసలు సమస్య ఈ మధ్యే మొదలైంది. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మాజీమంత్రి బస్వరాజు సారయ్య కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఆయన ఇదే నియోజకవర్గం నుంచి గతంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా పనిచేశారు. ఆయనకూ ఓ వర్గం సపోర్ట్ బాగా ఉంది. ఈ ఇద్దరు నేతలు ఒకే పార్టీలో ఉండటంతో చాలా రోజులుగా కోల్డ్ వార్ జరుగుతోంది.ఈ వార్ జరుగుతుండగానే.. కొండా ఫ్యామిలీ ప్రధాన అనుచరుడు ఒకరు వార్తల్లోకి ఎక్కారు. ఆయన పోరు పడలేకపోతున్నామని కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలే ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో సర్కారు ఇంటలిజెన్స్ అధికారుల నుంచి నివేదిక తెప్పించుకొని.. అతనికి ఉన్న సెక్యూరిటీని తొలగించింది. త్వరలోనే అతనిపై చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది.సరిగ్గా ఈ సమయంలో.. కొండా సురేఖ కొత్త



వివాదంలో చిక్కుకున్నారు. ఏ ఉద్దేశంతో మాట్లాడారో తెలియదు కానీ.. సినిమా ఇండస్ట్రీని టచ్ చేశారు. అది కూడా మామూలుగా కాదు. ఏకంగా సినిమా ఇండస్ట్రీ అంతా ఏకమయ్యేలా మంత్రి కామెంట్స్ ఉన్నాయి. దీంతో కొండా సురేఖ టాక్ ఆఫ్ ది తెలంగాణగా మారారు. పార్టీ తేరుకొని వివరణ ఇప్పించే ప్రయత్నం చేసినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.అక్కినేని నాగార్జున కోర్టు మెట్లెక్కి.. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఇష్యూ అత్యంత సున్నితమైంది కావడంతో.. కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా కొండా సురేఖతు సపోర్ట్ చేసేవారు లేకుండా పోయారు. ఏం మాట్లాడితే.. మన మెడకు ఏం చుట్టుకుంటుందోనని కాంగ్రెస్ పార్టీ నేతలే మాట్లాడుకుంటున్నట్టు తెలిసింది. అందుకే సైలెంట్‌గా ఉండటం బెటర్ అనే అభిప్రాయంలో ఉన్నట్టు.. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఒకరు చెప్పారు.కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. కానీ.. ఆ విషయం పక్కకుపోయి.. సమంత- నాగచైతన్య విడాకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. దీంతో సినీ ప్రముఖులు అంతా ముక్తకంఠంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కానీ.. కేటీఆర్‌పై ఈ స్థాయిలో ఆరోపణలు చేసినా.. బీఆర్ఎస్ మాత్రం వ్యూహాత్మకంగా మౌనంగా ఉంది. గులాబీ నేతలు ఎక్కడా ఈ ఇష్యూ గురించి మాట్లాడటం లేదు.బీఆర్ఎస్ మౌనం కారణంగా.. ఇప్పుడు వివాదం అంతా సినిమా ఇండస్ట్రీ, కాంగ్రెస్ పార్టీ మధ్య నడుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా విషయంలో అనేక ప్రశ్నలను ఎదుర్కొంటుంది. నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చినప్పటి నుంచి ఇండస్ట్రీ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై కాస్త వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అప్పుడు ఓ నిర్మాత ఇంట్లో కొందరు సినీ ప్రముఖులు భేటీ అయ్యి.. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై చర్చించినట్టు వార్తలు వచ్చాయి.ఆ ఇష్యూ పూర్తిగా సమసిపోక ముందే.. తాజాగా కొండా సురేఖ కామెంట్స్ అగ్గిలో ఆజ్యం పోసినట్టు అయ్యాయి. కూల్చివేత సమయంలో స్పందించని వారు కూడా ఇప్పుడు స్పందించి.. కొండా సురేఖ వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. అయితే.. ఈ వ్యవహారంలో మౌనంగా ఉండటమే తమకు మంచిదని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు ఏది మాట్లాడినా రాజకీయంగా నష్టం జరగవచ్చని బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. మొత్తానికి కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా ఉన్న పొలిటికల్ ఫైట్ ఇప్పుడు సైడ్ టర్న్ తీసుకుంది. దీంతో బీఆర్ఎస్ రిలాక్స్ అవుతోంది. అటు గులాబీ పార్టీ కూడా నేతలకు గట్టి సంకేతాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎవరు ఎంత రెచ్చగొట్టినా ఈ వ్యవహారంలో తలదూర్చవద్దని కీలక నేతలు వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఏం మాట్లాడినా.. చర్యలు తప్పవని హెచ్చరించినట్టు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.


# మూసీ మద్దతుగా నల్గొండ రైతులు

**నల్గొండ :** మూసీ ప్రక్షాళన అంశం ఇప్పటికే రాజకీయ మంటలు రేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల సవాళ్లు, ప్రతిసవాళ్లకు వేదికగా నిలుస్తోంది. మూసీ రివర్ బెడ్ లోని ఆక్రమణలను తొలగించడం, మూసీ మురుగు నీటి శుద్ధీకరణ, సుందరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50లక్షల కోట్ల ప్రాజెక్టుకు డిజైన్ చేసింది. మూసీ నదిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో ఉన్నారు. మూసీ ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని.. జిల్లా రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. కాలుష్య కూపంగా మారిన మూసీ నదిని ప్రక్షాళనకు జరిగిన ప్రయత్నాలు చాలా తక్కువ. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకింత ప్రయత్నించినా అది నివేదికలు, అంచనాల దశ దాటలేదు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లా ప్రజల జనజీవనంతో పెనవేసుకున్న మూసీ నది నీరు.. ఇపుడు విషతుల్యంగా మారింది. ఏళ్లుగా మూసీ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల సంఖ్య తక్కువేం కాదు.నకిరేకల్ నియోజకవర్గం సోలిపేట గ్రామం వద్ద మూసీ నదిపై మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టును 1960ల్లోనే నిర్మించారు. గతంలో ఈ నది నీరు సాగు, తాగు, పాడి, మత్స్య రంగాలకు ఉపయోగపడేది. హైదరాబాద్ దాటి వచ్చాక ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మూసీపై 24 కత్వాలు నిర్మించారు. వీటి ద్వారా సాగు నీరు అందేది. ఇదే మూసీ నీటిపై ఆధారపడిన ఆసిఫ్ నహర్ వంటి చిన్న తరహా ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలూ ఉన్నాయి. కానీ.. కాలుష్య నీటితో పండించిన పంటలను మార్కెట్‌లో అమ్ముకో లేని దుస్థితి నెలకొంది.అంతర్జాతీయ నగరంగా పేరున్న హైదరాబాద్‌లో మూసీ దుర్గంధాన్ని వెదజల్లుతోంది. మానవ వ్యర్థాలు, ఔషధ, రసాయన పరిశ్రమల వ్యర్థాలతో విషతుల్యం గా మారిన మూసీ నీరు ప్రజలకు అనారోగ్యాలను పంచుతోం ది. ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం మూసీ శుద్ధీకరణ, సుందరీక రణకు నడుం కట్టడంతో మూసీ పరీవాహక ప్రాంతాల వాసుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. మూసీ ఆక్రమణల తొలగింపు వివాదాస్పదం కావడం, ప్రతిపక్షాలు ప్రధానంగా బీఆర్ఎస్,




బీజేపీ నిర్వాసితుల పక్షాన ఆందోళనలకు దిగుతుండడంతో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచేందుకు జిల్లా రైతాంగం సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు.
ప్రభుత్వం ఎస్టీపీలతో మురికి నీటిని శుద్ధి చేసి, గోదావరి జలాలతో నింపి, రైతులకు మంచినీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతోందని అధికార కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి పరివాహక ప్రాంత ప్రజలను కాలుష్యం నుంచి విముక్తి కలిగించాలని ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వెళుతుంటే, ప్రతిపక్షాలు కుట్రలు పన్ని అడ్డుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతిపక్ష నాయకులు రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టించి మూసి ప్రక్షాళన అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టేందుకు రైతాంగాన్ని సమీకరిస్తున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికే అధ్వానంగా తయారైన మూసీ నదిని.. ఇకనైనా శుద్ధీకరించి కాపాడుకోకుంటే మూసీ పరీవాహక ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

## రుణమాఫీ కాలేదని సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో ఆగిన రైతు గుండె



**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ప్రజల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. ఆ పార్టీ అనాలోచితి నిర్ణయాలతో రైతుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అలవి కాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ తీరా గెలిచాక రైతులకు ఇచ్చిన హామీలు మరిచి మొండి చెయ్యి చూపించింది. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే తమ బ్రతుకులు బాగుపడుతాయని నమ్మిన అన్నదాతలకు చివరకు ఉరితాళ్లే దిక్కవుతున్నాయి. రుణమాఫీ కాక, వ్యవసాయం సాగక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా రుణమాఫీ కాలేదని రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఓ రైతు గుండె ఆగింది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్ పేట మండలం ఊరంచుతాండ గ్రామానికి చెందిన సోమ్లా(59) అనే రైతు 2023 డిసెంబర్ 9 కంటే ముందు బ్యాంకులో రుణం తీసుకున్నారు. ఆ రుణం కాస్త వడ్డీతో రూ.87,300 అయింది. అర్హత ఉన్నా రుణమాఫీ కాకపోవడంతో నిత్యం అదే ఆలోచించేవాడని, ఈక్రమంలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోమ్లా మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఒక కుటుంబం.. 20 గిన్నిస్ రికార్డులు




**పటాన్చెరు రూరల్:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ బీటెక్ పూర్వ విద్యార్థిని (2016-20) శివాలి జోహ్రి శ్రీవాస్తవ, ఆమె తల్లి కవిత జోహ్రి శ్రీవాస్తవ, తండ్రి అనిల్ శ్రీవాస్తవలు మూడు (18, 19, 20వ) గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించి కుటుంబసభ్యులతో శివాలి జోహ్రి శ్రీవాస్తవ చరిత్ర సృష్టించారు. 3,100 ఒరిగామి నెమళ్లు, 1,100 ఒరిగామి చొక్కాలు, 3,200 ఒరిగామి పందుల బొమ్మలను ఒకేచోట ఉంచిన ఈ కుటుంబం అతి పెద్ద ప్రదర్శనగా రికార్డు నెలకొల్పినట్టు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంతకు ముందు శివాలి కుటుంబం చేతితో తయారుచేసిన కాగితపు బొమ్మలు, క్విల్డ్ పువ్వులు, ఒరిగామి వేల్స్ పెంగ్విన్లు, సిట్రస్ పండ్లు, మాపుల్ ఆకులు, కుక్కలు, రాక్షస బల్లులు.. మరికొన్నింటితో సహా వివిధ ప్రదర్శనలతో 17 గిన్నిస్ ప్రపంచ రికార్డులను పొందింది. ఇవేకాక 15 అసిస్ట్ వరల్డ్ రికార్డ్, పది యూనిక్ వరల్డ్ రికార్డులను శివాలి కుటుంబం కలిగి ఉందని వివరించారు. మొత్తం 20 గిన్నిస్ రికార్డులను సాధించిన శివాలి, ఆమె తల్లిదండ్రులను గీతం హైదరాబాద్ అదనపు ఉపకుల పతి ప్రొఫెసర్ డీఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. సీతారామయ్య, గణిత విభాగం అధ్యాపకుడు డాక్టర్ మల్లికార్జున్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

## పెద్దపల్లి జిల్లాలో పోలీసుల ఆరాచకం.. బీఆర్ఎస్ ధర్నాను అడ్డుకున్న ఖాకీలు



**పెద్దపల్లి :** ప్రజాపాలన పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నది. ఒక్కడికక్కడ ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ పోలీస్ పాలన సాగిస్తున్నది. ప్రజాస్వామ్యయుతంగా చిన్న ధర్నా చేసుకోవడానికి కూడా వీలు లేకుండా ప్రభుత్వం, పోలీసులు అడ్డుకుంటున్నారు. తాజాగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరాస్తాలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నాను పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో అడ్డుకున్నారు. టెంటు వేయకుండా పోలీసులు అడ్డుకోవడంతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్ రావు, పుట్ట మధు రోడ్డుపైనే బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమాలను నిర్దాక్షిణంగా అణిచివేస్తున్న కాంగ్రెస్ పాలనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ తల్లి ఆలయంలో ఘనంగా అన్నదానం కార్యక్రమం



**(శుభ తెలంగాణ/కాప్రా)** కాప్రా గాంధీ నగర్‌లోని ప్రముఖ శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ తల్లి దేవాలయంలో నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తిట్కంది.అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించిన గుడ్డి దయానంద్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ,ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అన్నదానం కార్యక్రమం కోసం ఎంతో కృషి చేసిన గుడ్డి దయానంద్‌కు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయన కుటుంబానికి ఉండాలని,మైసమ్మ తల్లి ఆశీస్సులతో దయానంద్ కుటుంబం సుభిక్షంగా,సర్వాంగ సుందరంగా ఉండాలని కోరారు.ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు భక్తులకు ఎంతో సాయం చేశాయని,ఈ కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు,భక్తులు గణనీయంగా పాల్గొన్నారు.అన్నదానం అనంతరం భక్తులు దుర్గామాతను దర్శించుకుని,ప్రసాదం స్వీకరించారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఈ కార్యక్రమం మరింత విజయవంతంగా కొనసాగిందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.


# ఈ టిప్స్ ఫాలో అయితే.. మీ ప్రేమ మీ సొంతం అయినట్లే..



ప్రేమను అనుభవిస్తేనే తెలుస్తుంది ఎంత మధురంగా ఉంటుందో అంటుంటారు. కానీ ఇద్దరు ఆ అనుభూతి పొందితేనే లవ్ సక్సెస్ అవుతుంది. పెళ్లి పీటల వరకు వెళ్తుంది. అయితే ప్రేమలో చిన్న చిన్న తప్పులు ఆ క్షణం దక్కకుండా చేస్తాయి. అలా కాకుండా ఉండాలంటే ఈ మిస్టేక్స్ అవాయిడ్ చేయాలని సూచిస్తున్నారు నిపుణులు. ఈ టిప్స్ పాటిస్తే మీ ప్రేమ కచ్చితంగా విజయం సాధిస్తుందని భరోసా ఇస్తున్నారు. అనారోగ్య పోలికలు: మన జీవితాలను ఇతరులతో పోల్చుకోవడం ప్రమాదం. ఎవరి లైఫ్ కూడా సోషల్ మీడియాలో చూపించిన ఫొటో మాదిరిగా పర్ఫెక్ట్ గా ఉండదు. పైకి గొప్పగా కనిపించిన వారి విషయంలోనూ కొన్ని లూప్ హోల్స్ ఉండవచ్చు. అంటే ఎవరు సంపూర్ణంగా ఉండలేరని గుర్తించి.. ఒకరితో కంపేర్ చేసుకోకుండా..మన లైఫ్ మనం చూసుకుంటే హ్యాపీగా ఉండొచ్చని సూచిస్తున్నారు నిపుణులు. అంతేకాని పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు చేస్తే అసలుకే మోసం రావచ్చని హెచ్చరిస్తున్నారు. భాగస్వామితో పంచుకునే ప్రత్యేక బంధాన్ని కోల్పోయి.. అసంతృప్తి మాత్రమే మిగులుతుందని వార్న్ చేస్తున్నారు.

**గతాన్ని పట్టుకు వేలాడితే:** ప్రేమ అనేది జీవితంలో చాలా విలువైనది. కానీ కొన్ని సందర్భాల్లో కొందరితో బంధం మనను కోలుకోలేని దెబ్బతీయవచ్చు. ఆ తర్వాత మంచి పర్సన్ తో లవ్ లో పడొచ్చు. అలాంటప్పుడు ఆ సమయాన్ని, ఆ రిలేషన్ షిప్ ను ఎంజాయ్ చేయాలి. కానీ అనవసరంగా గతాన్ని తలుచుకుంటూ.. ప్రస్తుత బంధాన్ని అనుభూతి చెందడం మానేయకూడదు. అది అసలుకే ముప్పు తీసుకురావచ్చు. మీ ఇన్వాల్వ్మెంట్, ఇష్టం కనిపించని భాగస్వామి.. మీతో విసిపోవాలనుకునే నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుంది. అందమైన జీవితాన్ని నాశనం చేస్తుంది. అలా కాకుండా గతాన్ని పక్కన పెట్టేస్తే.. లవ్ జర్నీ చేయడం మరింత సులభం అవుతుంది. కోడిపెండెన్సీ: అంటే ఒక వ్యక్తి ఆనందం పూర్తిగా ఎదుటివారి చర్యలపై ఆధారపడి ఉంటాయి. ఇది వ్యక్తిగత ఎదుగుదలను అడ్డుకుంటుంది. అనారోగ్య డైనమిక్‌లను ప్రోత్సహిస్తుంది. కాబట్టి చాలా హానికరం. కాగా సొంత అవసరాలు, కోరికలు కోల్పోతారు. ప్రతి విషయంలో భాగస్వామిని పరిగణనలోకి తీసుకొనే ముందుకు సాగుతారు. ఇదే పద్ధతి ఎక్కువ కాలం కొనసాగితే మీకు విసుగు రావచ్చు. బంధానికి బై బై చెప్పాలని అనిపించవచ్చు. మొత్తానికి లవ్ కాస్త భరించలేనిదిగా మారి బ్రేకప్ అయ్యే అవకాశం ఉంటుంది. ఓవర్ రొమాంటిక్ లవ్: ప్రేమను అతిగా రొమాంటిసైజ్ చేయడం ప్రమాదమే. ఇలాంటి హాలివుడ్ వెర్షన్ లవ్ లో చిక్కుకున్నప్పుడు.. నిజ జీవిత సంబంధానికి చెందిన అవకాశాలను కోల్పోతాం. నిజమైన ప్రేమ అనేది రాజీ, అవగాహన, సహనం కలిసి ఉన్న జీవితాన్ని జీవించడం. అంతేకాని ఇలాంటి రొమాన్స్ కోరుకోవడం కాదు. రియల్ లవ్ ఎప్పుడు కలిసి జీవించాలని కోరుకుంటుంది కానీ ఆ విధంగా లవ్ కోరుకోకపోవచ్చు.

# తాజ్‌మహల్ కింద 22 రహస్య గదులు.. వాటిలో ఏమున్నాయో తెలిసి...



తాజ్ మహల్.. భారతదేశంలో అత్యంత ప్రసిద్ధ స్మారక చిహ్నం. ఆధునిక ప్రపంచంలోని ఏడు అద్భుతాలలో ఒకటి. మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన ప్రియమైన భార్య ముంతాజ్ మహల్‌కు నిర్మించిన తెల్లని పాలరాతి సమాధి. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా సందర్శించే వారసత్వ ప్రదేశం. కాగా ఇతర వారసత్వ ప్రదేశాల మాదిరిగానే... తాజ్ మహల్ దాని సొంత కథ, రహస్యాలను కలిగి ఉంది. ఈ నిర్మాణం కింద 'తేజో మహాలయ' అనే పురాతన శివాలయం శిథిలాలు, 22 రహస్య గదులు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఇక్కడ హిందూ దేవతల విగ్రహాలు, బొమ్మలు నిల్వ చేయబడ్డాయని తెలుస్తుంది.


ఇది ఎంతవరకు నిజమనే దానిపై చర్చ జరుగుతుంది. తాజ్ మహల్ నేలమాళిగలో నిజానికి గదులు ఉన్నాయి. కానీ వాటి గురించి రహస్యంగా ఏమీ లేదు. ఇవి నిజంగా గదులు కావు. సమాధి నేలమాళిగలో తలుపు జతచేయబడిన పొడవైన వంపు గల కారిడార్. ఈ ప్రాంతాన్ని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా క్రమం తప్పకుండా శుభ్రపరుస్తుంది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా తాళం వేసి ఉంచబడుతుంది. తాజ్ మహల్ కింద నిజానికి గదులు ఉన్నాయి, కానీ వాటి గురించి రహస్యంగా ఏమీ లేదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం బేస్మెంట్ గదులు సమాధి, మినార్లకు నిర్మాణాత్మక మద్దతును అందిస్తాయి. సంవత్సరాలుగా ఈ రహస్య గదులలోని విషయాల గురించి అనేక కుట్ర సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. చాలా మంది ఈ గదులు వేసవి వేడి నుంచి ఆశ్రయం కోసం ఉద్దేశించిన భూగర్భ గదిలో భాగమని చెప్పుకొచ్చారు. అయితే అత్యంత వివాదాస్పదమైనది.. ఈ గదులలో హిందూ దేవుళ్ళు, దేవతల విగ్రహాలు ఉన్నాయని, హిందూ దేవాలయాన్ని సమాధిగా మార్చారనే అంశం. 2022లో, అలహాబాద్ హైకోర్టు తాజ్ మహల్ నిజానికి శివుడికి అంకితం చేయబడిన హిందూ దేవాలయమని పేర్కొంటూ బిజెపి యువజన విభాగం నాయకుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 20కి పైగా తాళం వేసిన గదులలోని విషయాలపై వివరణాత్మక దర్యాప్తును కోరింది. సుప్రీంకోర్టు నిర్ణయం తర్వాత సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడాన్ని అరికట్టడానికి ~~~× రహస్య గదులు అని పిలవబడే చిత్రాలను విడుదల చేసింది. ముఖ్యంగా గదులు 1978 వరకు పబ్లిక్ సందర్శకుల కోసం ఓపెన్ చేసే ఉన్నాయి. పురాతన కాలంలో సమాధి దేవాలయంగా ఉందని 'తేజో మహాలయ' అని పిలిచేవారని తన అభ్యర్థనలో బిజెపి యువజన విభాగం నాయకుడు పేర్కొన్నాడు.

# మెరిసే చర్మం కోసం ఉదయాన్నే ఇలా చేయండి!



స్త్రీ అయినా, పురుషుడైనా అందరూ అందంగా కనిపించడం కోసం తమ ముఖానికి ఏదో ఒకటి రాసుకుంటూ ఉంటారు. కొంతమంది తమ ముఖాన్ని మచ్చలు లేకుండా, అందంగా మార్చుకోవడానికి రకరకాల క్రీమ్స్ పూస్తుంటారు. చాలా మంది తమ ముఖానికి వేప, తేనెను వాడతారు. ఇది వారికి చాలా ప్రయోజనం చేకూరుస్తుంది. వేప, తేనెలో అనేక లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే దీన్ని సరిగ్గా ఎలా వినియోగించాలో చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ ఆక్సిడెంట్ తదితర లక్షణాలు వేపలో ఉంటాయని తెలిసిందే.. తేనెలో కూడా యాంటీ బాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతో పాటు, అనేక వ్యాధులతో పోరాడడంలో సహాయకరంగా ఉంటుంది. అంతేకాకుండా.. ముఖంలో మెరుపు పెరుగుతుంది. ఉదయాన్నే తేనె, వేప తింటే దాని ప్రభావం మీ ముఖంపై స్పష్టంగా కనిపిస్తుంది. వేప, తేనెను పేస్ట్ చేసి ఖాళీ కడుపుతో తినాలి. వేప, తేనె పేస్ట్‌ని సులభంగా ఎలా తయారు చేయవచ్చో తెలుసుకుందాం. ముందుగా ఈ పేస్ట్‌ను తయారు చేసేందుకు వేప ఆకును తీసుకుని నీళ్లతో శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత ఆకులను మిక్సీలో వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. అందులో తేనె వేసి ఒక చెంచాతో కలపండి. ఈ పేస్ట్‌ను ఉదయం పూట తీసుకోవాలి.. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా మీ ముఖంపై మెరుపును కూడా తెస్తుంది. ఈ పేస్ట్‌ను ముఖానికి కూడా అప్లై చేసుకోవచ్చు. అయితే దీన్ని ముఖానికి అప్లై చేసే ముందు ముఖాన్ని శుభ్రమైన నీటితో శుభ్రం చేసుకోవాలి. వేప, తేనెను రోజూ వాడటం వల్ల ముఖంపై మొటిమలు రాకుండా ఉంటాయి. అంతేకాకుండా.. దురద నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తుంది. నల్లటి మొటిమలు కూడా తొలగిపోతాయి. దీన్ని ఉపయోగించడం వల్ల ముఖంపై వచ్చే మొటిమలు కూడా తొలగిపోతాయి. వేప, తేనె ముఖ సౌందర్యాన్ని పెంచుతాయి.

# ఈ చిట్కాలు మీకు తెలిస్తే, పిల్లల కోపాన్ని ఎదుర్కోవడం సులభం!



ఎవరికి కోపం రాదు, మనకి నచ్చిన వాళ్ళు ఇష్టం లేని పని చేస్తే సహజంగానే కోపం వస్తుంది. కానీ పిల్లలు అలా కాదు, నచ్చినవి తీసుకోనప్పుడు, నచ్చినవి చేయనివ్వనప్పుడు సహజంగానే కోపం ప్రదర్శిస్తారు. ఈ సమయంలో తల్లిదండ్రులు కూడా కొట్టడం ద్వారా తమ కోపాన్ని మరింతగా వెళ్లగక్కారు. అయితే ఈ పొరపాటు తల్లిదండ్రులు మాత్రమే చేయకూడదు. అలాంటి పిల్లలను చూసుకోవడానికి తల్లిదండ్రులకు ఓపిక చాలా అవసరం. కాబట్టి మీరు మీ కోపాన్ని వెళ్లగక్కకుండా పిల్లల కోపాన్ని అదుపు చేయవచ్చు. పరిస్థితిని ప్రశాంతంగా నిర్వహించండి: పిల్లలు కోపంగా ఉన్నప్పుడు, తల్లిదండ్రులు చేయవలసిన ముఖ్యమైన విషయం ప్రశాంతంగా ఉండటం. పిల్లవాడు ప్రకోపము చేస్తే, మీరు కుయుక్తులతో ప్రతిస్పందించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుంది. కాబట్టి ఎలాంటి రియాక్షన్ ఇవ్వకుండా ప్రశాంతంగా ఉండడం నేర్చుకోండి. పిల్లలు చెప్పేది వినడానికి ప్రయత్నిం చండి: పిల్లలు కోపంగా ఉండటానికి చాలా కారణాలు ఉండవచ్చు. కాబట్టి మీ పిల్లల మాటలను జాగ్రత్తగా వినడం , వారి భావాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం చాలా ముఖ్యం.సమస్య యొక్క మూలాన్ని అర్థం చేసుకోండి: చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు కోపంగా ఉన్నప్పుడు పిల్లలతో వాదిస్తారు. అయితే పిల్లల కుయుక్తుల వెనుక కారణాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. వారు ఎందుకు కోపంగా ఉన్నారో అప్పుడు మీకు తెలుస్తుంది. కాకపోతే వారిని ప్రశ్నలు అడగండి , వారి సమస్యను అర్థం చేసుకోండి. పిల్లలకు కూడా స్థలం ఇవ్వండి: చాలా మంది తల్లిదండ్రులు పిల్లలు కోపంగా ఉండకూడదని చెబుతారు. కోపం అనేది కూడా ఒక ఎమోషన్, దీని ద్వారా పిల్లలకు వ్యక్తీకరించే స్వేచ్ఛ ఉంది. కోపం వచ్చినప్పుడు పిల్లవాడిని కొట్టడం, శారీరకంగా గాయపరచడం సరికాదు. పిల్లవాడు తన కోపాన్ని వెళ్లగక్కాడు. పిల్లలను ఆజ్ఞాపించవద్దు: చాలా మంది తల్లిదండ్రులు కోపం తెచ్చుకోవద్దని పిల్లలను ఆదేశిస్తారు. కోపం తెచ్చుకుని మొండిగా మాట్లాడితే సరికాదని భయపడుతున్నారు. కానీ బెదిరింపులు మీ అభిప్రాయాలను వారిపై రుద్దడానికి ఎప్పుడూ ప్రయత్నించకూడదు. అలాంటి పరిస్థితుల్లో పిల్లలతో కూర్చుని పరిష్కారాలు కనుగొని పరిస్థితిని వివరించండి.

# మొబైల్ ఫోన్ ఉపయోగించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలు




ఈ డిజిటల్ యుగంలో ఆహారం, నీరు మాదిరిగానే సెల్ ఫోన్ మన జీవితంలో భాగమైపోయింది. ఈజీ కమ్యూనికేషన్, సులభంగా సమాచారం పొందడం ఇందుకు కారణం. కాగా అతి వినియోగం ఆరోగ్యాన్ని చిక్కుల్లో పడేస్తుందని ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిద్రకు ఆటంకాల నుంచి మానసిక సమస్యల వరకు ఎన్నో ప్రమాదాలు ఉండగా.. స్క్రీన్ సమయం పరిమితం చేయడం, జాగ్రత్త వహించడం చాలా ముఖ్యం.

**కంటి ఒత్తిడి:** ఎక్కువ సేపు స్మాల్ స్క్రీన్ చూస్తూ ఉండటం వలన కంటి ఒత్తిడికి దారి తీయవచ్చు. దీనిని సాధారణంగా 'డిజిటల్ ఐ స్ట్రెయిన్ ' లేదా 'కంప్యూటర్ విజన్ సింగ్రోమ్' అని పిలుస్తారు. మొబైల్ ఫోన్ స్క్రీన్స్ బ్లూ లైట్‌ను విడుదల చేస్తాయి, ఇది కళ్ళలో అసౌకర్యాన్ని కలిగిస్తుంది, ఇది అస్పష్టమైన దృష్టి, పొడి కళ్ళు, తలనొప్పి, ఫోకస్ చేయడంలో ఇబ్బంది వంటి లక్షణాలకు దారితీస్తుంది. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, దాన్ని యూజ్ చేయనివారితో పోలిస్తే కంటి నొప్పి, కళ్ళుపొడిబారడం ప్రమాదం 39.7 శాతం ఎక్కువ ఉంటుంది.

**దీర్ఘకాలిక మెడ నొప్పి:** సోషల్ మీడియా ద్వారా టెక్స్ట్ చేస్తున్నప్పుడు లేదా స్క్రోలింగ్ చేస్తున్నప్పుడు.. కుంగిపోయిన స్థితిలో కూర్చోవడం సాధారణం. కాగా ఈ భంగిమ వల్ల సాధారణంగా టెక్స్ట్ నెక్ అని పిలవబడే పరిస్థితి ఏర్పడుతుంది. మీ ఫోన్‌ని ఉపయోగిస్తున్నప్పుడు మీ తలను ఎక్కువ సేపు ముందుకు ఉంచడం వల్ల మీ మెడ, భుజాల్లోని కండరాలు దృఢంగా, నొప్పిగా మారినప్పుడు ఇది జరుగుతుంది. టెక్స్ట్ నెక్ దీర్ఘకాలిక నొప్పికి దారితీస్తుంది. పరిష్కరించకపోతే దీర్ఘకాలిక సమస్యలకు కూడా దారి తీస్తుంది. పీర్ జర్నల్ ప్రచురించిన అధ్యయనంలో మొబైల్ ఫోన్ వినియోగదారులలో నెక్ డిజార్డర్స్, టెక్స్ట్ నెక్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని వెల్లడించింది.

**నిద్ర రుగ్మతలు:** పడుకునే ముందు మొబైల్ ఫోన్ ఉపయోగించడం సర్వసాధారణం. కాగా ప్రజలు స్లీప్ డిజార్డర్స్ పొందేందుకు ఇది ఒక కారణం కావచ్చు. నేచర్ అండ్ సైన్స్ ఆఫ్ స్లీప్ ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. లైట్లు ఆపివేయబడిన తర్వాత కనీసం 30 నిమిషాల పాటు మొబైల్‌ని ఉపయోగించడం నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తుంది. పగటిపూట నిద్రపోవడం, నిద్ర ఆలస్యం ప్రమాదాన్ని పెంచుతుంది. ఫోన్ స్క్రీన్‌ల నుంచి వెలువడే బ్లూ లైట్ నిద్రను నియంత్రించే బాధ్యత కలిగిన మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తుంది. ఈ అంతరాయం మీకు నిద్రపోవడం కష్టతరం చేస్తుంది లేదా నాణ్యత లేని నిద్రకు దారి తీస్తుంది. గుండె సమస్యలు: మొబైల్ ఫోన్ వాడకం ముఖ్యంగా గుండె సమస్యలతో కూడా ముడిపడి ఉంది. కెనడియన్ జర్నల్ ఆఫ్ కార్డియాలజీలో ప్రచురించబడిన అధ్యయనంలో .. క్రమరహిత మొబైల్ ఫోన్ వినియోగదారులతో పోలిస్తే, మొబైల్ ఫోన్‌లకు ఎక్కువసేపు బహిర్గతం అయినవారిలో హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచవచ్చని పరిశోధకులు కనుగొన్నారు. ముఖ్యంగా ధూమపానం చేసేవారిలో, మధుమేహం వంటి దీర్ఘకాలిక పరిస్థితులు ఉన్నవారిలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది . పడుకునే ముందు కనీసం ఒక గంట ముందు మొబైల్ ఫోన్‌ని ఉపయోగించకుండా ఉండటానికి ప్రయత్నించండి.



# నిఖిల్ కొత్త సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్

కార్తికేయ, కార్తికేయ 2 సినిమాలతో పాన్ ఇండియా హీరోగా ఎదిగాడు టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్. ప్రస్తుతం ఈ కుర్ర హీరో స్వయంభుతో పాటు ది ఇండియా హౌస్ అనే సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో తాజాగా మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు నిఖిల్. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం అప్పుడో ఇప్పుడో ఎప్పుడో బొమ్మరిల్లు సినిమాలోని బ్లాక్ బస్టర్ పాట అయిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే పాటను టైటిల్‌గా తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు స్వామిరారా దర్శకుడు సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తుండగా.. ఛత్రపతి, డార్లింగ్ లాంటి బ్లాక్ బస్టర్ అందుకున్న టాలీవుడ్ టాప్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ప్రొడక్షన్స్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ మూవీని దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇక ఫస్ట్ లుక్ చూస్తే లవ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. కన్నడ చిత్రం సప్త సాగరాలు దాటి సినిమాతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది.



# ప్రభాస్ సినిమాలో విలన్‌గా చేస్తా

పాన్ ఇండియా నటుడు ప్రభాస్, నటుడు గోపిచంద్‌ల ఫ్రెండ్‌షిప్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. వర్షం సినిమా టైంలో మొదలైన వీరిద్దరి స్నేహం ఇప్పుడు ఇంకా బలంగా మారింది. అప్పుడప్పుబు గోపిచంద్ సినిమాలకు వచ్చి తనను సపోర్ట్ చేస్తుంటాడు ప్రభాస్. అయితే వర్షం తర్వాత ఈ ఇద్దరి కాంబినేషనల్‌లో మళ్లీ సినిమా రాలేదు. ఈ ప్రభాస్, గోపిచంద్‌ల కాంబోలో సినిమా వస్తే చూద్దామని అటు రెబల్ అభిమానులతో పాటు ఇటు గోపిచంద్ ఫ్యాన్స్ కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ విషయంపై తాజాగా స్పందించాడు గోపిచంద్. గోపిచంద్ కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం విశ్వం. ఈ సినిమాకు శ్రీను వైట్ల దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా గోపిచంద్ మళ్లీ విలన్‌గా నటిస్తారా అని రిపోర్టర్ అడుగగా.. విలన్ రోల్ చేయాలని లేదు. కానీ ప్రభాస్ సినిమాలో అయితే విలన్ రోల్ అయితే తప్పకుండా చేస్తాను అంటూ గోపిచంద్ చెప్పుకోచ్చాడు. దీంతో వీరిద్దరి కాంబో ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్నామని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.



## బ్యాక్ టు బ్యాక్ ట్రీట్స్.. సూర్య టీం కంగువ ప్రమోషనల్ స్ట్రాటజీ అదిరింది!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కాంపౌండ్ నుంచి వరుస సినిమాలు వస్తున్నాయని తెలిసిందే. వీటిలో ఒకటి పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తున్న కంగువ సూర్య 42వ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీకి శివ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. బాబీ డియోల్ ఉధిరన్ పాత్రలో నటిస్తున్నాడు. కాగా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో బ్యాక్ టు బ్యాక్ ప్రమోషనల్ స్ట్రాటజీతో ముందుకెళ్తోంది సూర్య టీం. తాజా సమాచారం ప్రకారం ఈ వారం కంగువ సెకండ్ సింగిల్ రాబోతుంది. ఆడియో లాంచ్ ఈవెంట్ అక్టోబర్ 20న నిర్వహించనున్నారట. అంతేకాదు అక్టోబర్ చివరలో వరల్డ్ వైడ్ ప్రోమోను లాంచ్ చేయనుండగా.. నవంబర్ తొలి వారంలో ట్రైలర్‌ను లాంచ్ చేయనున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీని స్టూడియో గ్రీన్–యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కంగువను నైజాం ఏరియాలో పాపులర్ టాలీవుడ్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేయనుంది. కంగువ రెండు పార్టులుగా వస్తుండగా.. పార్టు 1 నవంబర్ 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ముందుగా అక్టోబర్ 10న రావాల్సిన ఈ చిత్రాన్ని వెట్టైయాన్‌తో పోటీ ఉండొద్దని భావించిన మేకర్స్ కొత్త విడుదల తేదీని నిర్ణయించారని తెలిసిందే.




# నవంబర్ 14న 'దేవకీ నందన వాసుదేవ'

టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం దేవకీ నందన వాసుదేవ జాంబిరెడ్డి, హనుమాన్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథనందిస్తుండగా.. గుణ 369 ఫేం అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం విడుదలకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను నవంబర్ 14న విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాలో అశోక్ గల్లా సరసన హీరోయిన్‌గా మాజీ మిస్ ఇండియా (2020) మానస వారణాసి నటిస్తుంది. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ (ఎన్ఆర్ఐ) ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రానికి ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రాఫర్ కాగా తమ్మిరాజు ఎడిటర్. ఇక కార్తికేయ హీరోగా అర్జున్ జంధ్యాల చివరగా డైరెక్ట్ చేసిన గుణ 369 బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ఈ సారి ఎలాగైనా మంచి హిట్టు కొట్టాలని చూస్తున్నాడు అర్జున్ జంధ్యాల.



# బాడీ చూపించి జనాల్ని రప్పించడం నచ్చదు

గ్లామర్ రోల్స్, స్కిన్ షో చేయడంపై అసహనం వ్యక్తం చేశారు తమిళనటి ప్రియా భవానీ శంకర్ ప్యాషన్ పేరుతో శరీరాన్ని చూపించడం తనకు ఇష్టం లేదన్నారు. 'కళ్యాణం కమనీయం' తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె కోలీవుడ్‌లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన తదుపరి సినిమా 'బ్లాక్' గురించి మాట్లాడారు. "నా శరీరాన్ని ఒక వస్తువుగా భావించను. ప్రేక్షకులను రప్పించడం కోసం గ్లామర్‌గా కనిపించడం నాకు నచ్చదు. అలాంటి వాటిని అంగీకరించను. కెరీర్ పరంగా ఎప్పుడైనా వెనక్కి తిరిగి చూసుకుంటే ఏ విషయంలోనూ బాధపడకూడదనుకుంటాను. అందుకు అనుగుణంగానే ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటా. నెగెటివ్ రోల్ చేయడానికీ వెనుకాడను. ఎందుకంటే అది నా వృత్తి. అలాగే, ఒక హీరోయిన్‌గా ఫ్యాషన్ పేరుతో కొన్నింటిని ప్రమోట్ చేయలేను" అని అన్నారు. గ్లామర్ పాత్రలు గురించి ఆమె గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. "అతి తక్కువ సమయంలో పామ్‌లోకి వెళ్లి, ఫేం తెచ్చుకోవడానికి గ్లామర్ అనేది అడ్డదారి అని చాలామంది భావిస్తుంటారు. నిజం చెప్పాలంటే అది చాలా కష్టమైన పని. దానిని నేను సౌకర్యవంతంగా భావించలేను. అదీకాక ప్రేక్షకులు నన్ను గ్లామర్ పాత్రల్లో చూడటానికి ఇష్టపడరు" అని అన్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110